నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, జనవరి 20: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ సబ్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరా నిలివేస్తున్నట్లు ఆస్మాన్‌ఘడ్ డీఈఈ హనుమంత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ చాదర్‌ఘాట్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి 11గంటల వరకు, 11కేవీ ఎంఎంహెచ్, 11కేవీ ఉస్మాన్‌పురా ఫీడర్ల పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, 11కేవీ కలాడేరా ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

రేపు సాయిబాబా ఆలయంలో పూజలు

ఎల్బీనగర్, జనవరి 20: అయోధ్య రామ మందిరంలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా జనవరి 22న ఉదయం ఐదు గంటలకు భక్తులతో నగర సంకీర్తన, 8 గంటలకు సీతారామచంద్రాస్వామికి ఆవు పాలతో అభిషేకం, పంచామృతాభిషేకం, పంచ హారతి, ఉదయం 9 నుంచి హనుమాన్ చాలీసా, ప్రత్యేక భజన, సంస్తాన్ ఆర్చి వద్ద జెండా ఆవిష్కరణ, ఉదయం 11.30గంటలకు భక్తులతో సీతారామచంద్రాస్వామి శోభాయాత్ర తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ ట్రస్ట్ చైర్మన్ గుండ మల్లయ్య తెలిపారు. ఈ మేరకు సాయిబాబా ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ చైర్మన్ తెలిపారు.

బాలాపూర్‌లో భూమాయ

- సర్కార్ భూములకు ఎసరు
- కలెక్టర్‌కు స్థానికుల ఫిర్యాదు
- తూతూమంత్రంగా కూల్చివేతలు
- మళ్లీ జోరందుకున్న నిర్మాణాలు
- కబ్జాదారులకే అధికారుల వత్తాసు
- భూములను కాపాడాలని వేడుకోలు



బడంగ్‌పేట, జనవరి 20: కంచె చేను మేసిన తీరు తయారైంది బాలాపూర్ రెవెన్యూ అధికారుల తీరు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతుంటే అడ్డుకోవాల్సింది పోయి కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్నారు. అక్రమార్కుల నుంచి మామూలు దండుకొని ఫిర్యాదు దారులపై అధికారులే బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇటీవల కాలంలో ఈ తంతు కలెక్టర్ వరకు చేరగా.. కలెక్టర్ ఆదేశాల మేరకు తూతూ మంత్రంగా కూల్చివేతలు చేపట్టిన రెవెన్యూ అధికారులు అక్రమార్కులపై చర్యలు తీసుకోకుండా పత్తాలేకుండా పోయారు. అంతే కాకుండా రెవెన్యూ అధికారులు తెరచాటున ఉండి కబ్జాదారులను ప్రోత్సహిస్తుండటంతో కూల్చివేసిన చోటే మళ్లీ అక్రమాల జోరు ఊపందుకున్నది. అక్రమార్కులతో చేతులు కలిపిన రెవెన్యూ అధికారుల తీరుతో బాలాపూర్ మండల పరిధిలో వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూములు కరిగిపోతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని.. ప్రభుత్వ భూములను కాపాడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

వివరాల్లోకి వెళితే..

బాలాపూర్ మండల పరిధిలోని మామిడిపల్లి సర్వే నంబర్ 99/1, అల్మాస్‌గూడ సర్వే నంబర్ 86/1, మల్లాపూర్‌లోని సర్వే నంబర్ 23, జల్‌పల్లిలోని సర్వే నంబర్ 223, మీర్‌పేట పరిధిలోని సర్వే నం.119, జిల్లెలగూడలోని సర్వే నంబర్ 155, కుర్మల్‌గూడ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 80/47, 46లలో జోరుగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఇటీవల జిల్లా కలెక్టర్‌కు స్థానికుల నుంచి ఫిర్యాదులు అందాయి. వెంటనే స్పందించిన కలెక్టర్ అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీచేయడంతో కూల్చివేతలు చేపట్టారు. అయితే అదే సమయంలో కబ్జాదారులపై చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడతో కూల్చివేసిన చోటే మళ్లీ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. దీంతో మళ్లీ స్థానికుల నుంచి ఫిర్యాదుల పరంపర కొనసాగుతూనే ఉన్నది. అయినప్పటికీ అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా చర్యలు తీసుకోవాల్సిన అధికారులే ఫిర్యాదుదారులపై బెదిరింపులకు పాల్పడటం చర్చనియాంశంగా మారింది. ప్రభుత్వ భూములలో సూచిక బోర్డులు ఏర్పాటు చేసి చుట్టూ సరిహద్దులను గుర్తించి ఫెన్సింగ్ వేయించాలని ఆదేశాలు ఉన్నప్పటికీ స్థానిక రెవెన్యూ అధికారులు మాత్రం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. కొన్ని చోట్ల సూచిక బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ కబ్జాదారులు వాటిని తొలగించినా.. అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడి కబ్జాదారులపై చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

కందుకూరు సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

పల్లె ప్రగతి దేశానికే ఆదర్శం

కందుకూరు. జనవరి 20 : అభివృద్ధి విషయంలో రాజకీయాలకు తావు ఉండకూడదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. శనివారం మండల పరిషత్ సమావేశపు హాల్‌లో ఎంపీపీ మంద జ్యోతి పాండు అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఫార్మాసిటీని కాంగ్రెస్ పార్టీ రద్దు చేస్తామని చెప్పడంతో రైతులు ఆందోళనకు గురయ్యారని.. వారి అపోహలను తొలగించాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన పల్లె ప్రగతి ద్వారా తెలంగాణ పల్లెలకు దేశంలో మంచి గుర్తింపు వచ్చిందని గుర్తు చేశారు. ఫార్మాసిటీ రైతులకు తక్షణమే ఎకరాకు గుంట భూమి చొప్పున ప్లాట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వకాలను అరికట్టాలని.. పీవోటీ భూముల్లో తవ్వకాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులకు సూచించారు. మొక్కలు నాటడానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. అదే విధంగా స్థానిక సమస్యలను సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీనగర్ డీసీపీకి శుభాకాంక్షలు

ఎల్బీనగర్ డీసీపీగా బాధ్యతలు చేపట్టిన ప్రవీణ్‌కుమార్(ఐపీఎస్)ను కలిసి శాలువాతో సన్మానించి.. పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయ పాలకమండలి చైర్మన నల్ల రఘుమారెడ్డి, ఆలయ ధర్మకర్త మధుసాగర్, నాయకులు కిరణ్, గౌర శ్రీనివాస్, చిరంజీవి సాగర్

– చంపాపేట, జనవరి 20

ఆకట్టుకుంటున్న హ్యాండ్లూమ్ మేళా

వనస్థలిపురం, జనవరి 20 : వనస్థలిపురం కమ్యూనిటీ హాల్‌లో ఆలిండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీ క్రాఫ్ట్ మేళా ప్రదర్శనకు రోజు రోజుకూ ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తున్నదని నిర్వాహకులు అక్బర్ అలీ తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో పలు రాష్ట్రాలకు చెందిన చేనేత కళాకారులు తమ ఉత్పత్తులతోపాటు నాణ్యమైన సిల్క్ ఉత్పత్తులను ప్రదర్శించామని తెలిపారు. చేనేత ఖాదీ వస్త్రాలను వారానికి ఒక సారైన ధరించి చేనేత కార్మికుల చేయూత ఇవ్వాల్సిన అవసరం ఎంతైన ఉన్నదని అన్నారు. దేశ సంస్కృతి సంప్రదాయాలకు నిలయమైన చేనేత వస్త్రాలను ఆదరించాలని కోరారు. ఈ అవకాశం రెండు రోజులు మాత్రమే ఉంటుందని తెలిపారు.

వివిధ రకాల చేనేత వస్త్రాలను కొనుగోలు చేస్తున్న మహిళలు

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

మలక్‌పేట, జనవరి 20: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని సౌత్ ఈస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ తెలిపారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం మలక్‌పేట మార్కెట్‌లోని తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్ కార్యాలయంలో వ్యాపారులు, రైతులు, హమాలీలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్న వారిలో ఎక్కువ శాతం 18 నుంచి 40ఏండ్ల లోపు వారే ఎక్కువ ఉన్నారని తెలిపారు. సురక్షిత ప్రయాణాలకు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. మైనర్లకు వాహనాలను ఇవ్వొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్ఐలు రామస్వామి, గంగాధర్, సిబ్బంది, తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్ అధ్యక్షుడు చేగూరి వెంకటరమణ, కార్యదర్శి బట్కిరి రాజు, ఉపాధ్యక్షుడు ఎం. కృష్ణ, వ్యాపారులు దుగ్గ జగదీశ్ కుమార్, బాలాజీ, జగదాంబ శ్రీనివాస్, బండారు శ్రీను, క్యాతం వెంకటేశ్, మిత్ర రాజు, వంజరి వినోద్, రైతులు, హమాలీలు తదితలు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న సౌత్ ఈస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ

పువ్వులు అందజేసి అవగాహన

సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ఐఎస్ సదన్ చౌరస్తాలో వాహనదారులకు ట్రాఫిక్ నియమాలపై ఇన్‌స్పెక్టర్ నర్సింహ నాయక్, ఎస్ఐలు సత్యనారాయణ, వెంకటప్ప, సిబ్బంది అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించని వారికి పువ్వులు అందజేసి వినూత్న రీతిలో అవగాహన కల్పించారు.

–సైదాబాద్, జనవరి 20:

సకల సౌకర్యాలతో మైనార్టీ గురుకులాలు

వనస్థలిపురం, జనవరి 20: ప్రభుత్వ మైనార్టీ గురుకుల కళాశాలలు సకల సౌకర్యాలతో విద్యనందిస్తున్నాయని, ఖైరతాబాద్–1 ప్రిన్సిపాల్ షేక్ హబీబ్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఎన్‌రెడ్డినగర్ కళాశాలలో రానున్న విద్యా సంవత్సరానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. హెచ్‌ఈసీ, సీఈసీ గ్రూప్‌లో చేరేందుకు ఈ నెల 18 నుంచి ఫిబ్రవరి 6వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. తమ కళాశాలలో సంప్రదిస్తే ఎలాంటి రుసుము లేకుండా అప్లికేషన్‌లు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 91826 28275, 77028 58048 నంబర్లలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు

టీసీఏటీ నూతన అధ్యక్షుడికి అభినందనలు

మలక్‌పేట, జనవరి 20 తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్(టీసీఏటీ) నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన చేగూరి వెంకటరమణను అభినందిస్తున్న ఆర్యవైశ్య వర్తక సంఘం సభ్యులు వాడకట్టు సంతోష్, కె.నవీన్, రాఘువేందర్, మణికంఠ సంతోష్, రమేశ్, వాసవి కిరాణ వాసు, తదితరులు

సలీంనగర్ గణపతి ఆలయంలో స్వచ్ఛ తీర్థ్

మలక్‌పేట, జనవరి 20: అయోధ్యలో శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ స్వచ్ఛ తీర్థ్ పిలుపుమేరకు శనివారం సలీం నగర్‌లోని గణపతి దేవాలయాన్ని శుభ్రం చేస్తున్న కార్పొరేటర్ బి.భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, బీజేపీ నాయకులు, రామ భక్తులు

చిన్నారులకు స్లీపింగ్ స్లాక్స్ అందజేత

సైదాబాద్, జనవరి 20: సింగరేణి కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం చెల్డ్ హెల్ప్ ఫౌండేషన్ (ఎన్‌జీవో) సంస్థ ప్రతినిధులు చిన్నారులకు స్లీపింగ్ స్లాక్ అందజేశారు. ఈ సందర్భంగా చెల్డ్ హెల్ప్ ఫౌండేషన్ మేనేజర్ నీలి ఫణీందర్ మాట్లాడుతూ నగరంలో 9 అంగన్‌వాడీ కేంద్రాల్లో సుమారు నాలుగు వందల మందిపైగా చిన్నారుల ఆరోగ్య పరిశుభ్రత కోసం ఉచితంగా స్లీపింగ్ స్లాక్స్ అందజేశామని తెలిపారు. పేద పిల్లలకు విద్య, వైద్యం, సాధికారత కోసం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్ అన్నపూర్ణ, చెల్డ్ హెల్ప్ ఫౌండేషన్ ప్రతినిధులు కర్నా జయశీల, వెంకటేశ్, రూప, సుమాంజలి జ్యోతి పాల్గొన్నారు.

రాముల వారి విగ్రహ ప్రతిష్ఠకు ఆలయాలు ముస్తాబు

సైదాబాద్, జనవరి 20: అయోధ్యలో సోమవారం బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని మలక్‌పేట నియోజకవర్గం పరిధిలోని ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఆలయానికి వచ్చే భక్తులు విగ్రహ ప్రతిష్ఠను తిలకించేందుకు భారీ ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నారు. దయానంద్ నగర్‌లోని హరిహర క్షేత్రంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సూగురు రమేశ్ తెలిపారు. అదే విధంగా సైదాబాద్ జైల్ గార్డెన్‌లోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో శనివారం కార్పొరేటర్ కొత్తకాపు అరుణ, బీజేపీ నాయకులు సుభాష్‌చందర్జీ, కాత్తకాపు రవీందర్ రెడ్డి, నవీన్, రాజేశ్ తదితరులు ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు.

ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో పరిసరాలను శుభ్రం చేస్తున్న మాజీ డిప్యూటీ మేయర్ సుభాశ్ చందర్జీ

ఓటరు నమోదుకు దరఖాస్తుల స్వీకరణ

ఎల్బీనగర్, జనవరి 20: ఎల్బీనగర్ నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల వద్ద నూతన ఓటర్ల నమోదు, ఓటర్ ఐడీ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరణ కార్యక్రమం శనివారం అధికారులు నిర్వహించారు. ఆదివారం కూడా దరఖాస్తులు స్వీకరిస్తామని.. ఓటర్ ఐడీలో సవరణలకు కూడా దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు.

టన్నెలింగ్‌తో ముంపు సమస్యలకు చెక్

ఎల్బీనగర్, జనవరి 20: సరూర్‌నగర్ చెరువు కట్టపై టన్నెలింగ్ పనులతో గడ్డిఅన్నారం డివిజన్‌లో వరద ముంపు నుంచి విముక్తి లభిస్తుందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. శనివారం సరూర్‌నగర్ చెరువు కట్ట వద్ద జరుగుతున్న టన్నెలింగ్ పనులు పరిశీలించి మాట్లాడారు. గడ్డిఅన్నారం డివిజన్‌లో వరదనీటి ముంపు సమస్యలు తీర్చేందుకు టన్నెలింగ్ పనులు చేపట్టామని.. ఇప్పటికే దాదాపుగా 95 శాతం పనులు పూర్తయ్యాయని.. పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. గతంలోనే వరద నీటిని నియంత్రించేందుకు రెండు గేట్లు ఏర్పాటు చేశామని తెలిపారు. నాయోజకవర్గంలో ప్రధాన సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని.. ప్రజలు కూడా తమ సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ప్రవీణ్‌కుమార్, మాజీ కౌన్సిలర్ రమేశ్ ముదిరాజ్, రమణారెడ్డి, ప్రదీప్, విక్క, ఇరిగేషన్ అధికారులు డీఈ పవన్, కంట్రాక్టర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

టన్నెలింగ్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

హనుమాన్ యువసేన ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ

మోహన్‌నగర్‌లో హనుమాన్ యువసేన ఆధ్వర్యంలో అయోధ్య రామమందిర విగ్రహ ప్రతిష్ఠాపన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హనుమాన్ యువసేన నాయకులు యశ్పాల్ గౌడ్, దాసు గౌడ్, రాజేందర్, కులకర్ణి, భాస్కర్, కిరణ్, వినోద్, గౌరవ్, వెంకటేశ్, అభిషేక్, అభినయ్ తదితరులు పాల్గొన్నారు.

– ఎల్బీనగర్, జనవరి 20

రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులుగా జ్యోతి కృష్ణారెడ్డి

కార్యవర్గం ఎన్నిక పత్రాన్ని తహసీల్దార్ గోపాల్‌కు అందజేస్తున్న రేషన్ డీలర్లు

కందుకూరు, జనవరి 20 : రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షులుగా మండల కేంద్రం డీలర్ దేశం జ్యోతి కృష్ణారెడ్డి ఎంపిక య్యారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో కల్లెం కేశవులు తప్పుకుంటున్నట్లు ప్రకటించడంతో జ్యోతి కృష్ణారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఆలూరి జంగయ్య (మీర్‌ఖాన్‌పేట్), యాదగిరిగౌడ్ (మాదాపూరు). ప్రధాన కార్యదర్శిగా ఆకుల రాజు (ముచ్చర్ల), కార్యదర్శులుగా మాదారం రమేశ్‌గౌడ్ (బేగంపేట్), నాగులపల్లి ప్రభాకర్‌రెడ్డి (జబ్బారుగూడ), కోశాధికారిగా శ్రీనివాస్‌గౌడ్(తిమ్మాపూరు)ను ఉన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం తాసీల్దార్ గోపాల్‌కు కార్యవర్గ పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయబ్ తాసీల్దార్ తాజుద్దీన్, డీలర్లు బాలయ్య, బొక్క వీణ బాల్‌రెడ్డి, దశరథ గౌడ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



జలమండలి అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మెరాజ్ హుస్సేన్

మాదన్నపేట, జనవరి 20: యాకుత్‌పూర నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే మెరాజ్ హుసేన్ తెలిపారు. శనివారం నియోజకవర్గంలో జరుగుతున్న వాటర్ వర్క్స్ పనులు పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. అధికారులతో చర్చించి తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంతోష్‌నగర్ కార్పొరేటర్ ముజఫర్ హుసేన్, కార్పొరేటర్ మహపర, సీనియర్ నాయకులు సంధాని తదితరులు పాల్గొన్నారు.

డిక్షనరీలు అందజేత

కందుకూరు. జనవరి 20 : విద్యార్థుల భవిష్యత్‌ను మార్చేది 10వ తరగతి అని అయిస్టరు స్వచ్ఛంద సంస్థ కోశాధికారి పద్మిని, కోఆర్డినేటర్ రిషిక తెలిపారు. శనివారం మండల పరిధిలోని ముచ్చర్ల జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో కౌన్సిల్ ఫర్ గ్రిన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ, అయిస్టర్ సంయుక్తంగా విద్యార్థులకు కెరీయర్ గైడెన్స్ అవగాహన కల్పించి డిక్షనరీలు అందజేశారు. హెచ్ఎం గోవర్ధన్‌రెడ్డి, సంస్థ సభ్యులు భూవన, అనన్య, ఐశ్వర్య, ఆకాశ్, సుమిత్, గోపీచంద్, గణేశ్, రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు వినియోగించుకోవాలి

ఆర్కేపురం, జనవరి 20 : అర్హులందరూ ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని శనివారం ఆర్కేపురం డివిజన్ చిత్రలేఅవుట్ కాలనీలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. అనంతరం ఏర్పాట్లను తెలుసుకొని మాట్లాడారు. 18 ఏండ్లు నిండిన వారు ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. అదే విధంగా ఇప్పటికే ఓటరుగా నమోదై ఉన్నవారు జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేదో చెక్ చేసుకోవాలని తెలిపారు. ఓటరు గుర్తింపు కార్డులో తప్పులుంటే స్థానిక పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు అందుబాటులో ఉండే బీఎల్‌వోలను కలిసి సరిచేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సరూర్‌నగర్ తాసీల్దార్ కే.కృష్ణ, ఏఈఆర్ఓ నర్సింగ్‌రావు, ఆర్ఐ. యాదగిరి, చిత్రలేఅవుట్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెండ్యాల నాగేశ్ తదితరులు ఉన్నారు.

చిత్రలేఅవుట్ కాలనీలో ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక

క్యాలెండర్ ఆవిష్కరణ

కందుకూరు, జనవరి 20: విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాధికారి మనోహర్ తెలిపారు. శనివారం సాయంత్రం మండల విద్యావనరుల కేంద్రంలో టీఎస్ యూటీఎస్ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు.

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మండల విద్యాధికారి మనోహర్, టీఎస్ యూటీఎఫ్ నాయకులు